కథ

**ఆరు ఎఱ్ఱటి ఏగానీలు కూడబెడితే అణాగా, పదహారు అణాలు దాచుకొంటే రూపాయి కాసుగా లంకె బిందెలలో దుడ్డు నిక్షిప్తం చేసుకొనే రోజులలో పుట్టడంతో పెత్తాత, తన మనవడికి గనిరాజు అని పేరు పెట్టింది. మా ఊళ్ళో నాకు ఊహ తెలిసినప్పటి నుంచి గనిరాజును చూస్తున్నాను. కాటన్‌దొర పుణ్యమా అని మా ఊరికి గోదారి కాల్వతో పంట కూడా వచ్చింది. అయినా గనిరాజు ఎఱ్ఱటి ఏగానికి పనికిరాడని ముత్తాత తన పిసినారి బుద్ధులన్నీ నేర్పుతూ గనిరాజును పెంచాడు. మా ఊళ్ళో గనిరాజు అందరికంటే డబ్బున్న వాడే. పరాయి సంబంధం కాకుండా అక్క కూతురుతో పెళ్ళిచేసారు. ఆ దంపతులకు పిల్లలు పుట్టలేదు.**

# పెట్టె చీకుడు

**– జయసూర్య**

మా ఊరు మోతుబరులలో గనిరాజు, ఊరంతటితో ఎవరికీ కానీ విదపకపోయినా, కలుపుగోలుగా వుండేవాడు. అందరితో కష్టసుఖాలు మాట్లాడేవాడు. వడ్డీలకు డబ్బు తిప్పేవాడు. వడ్డీ డబ్బులు నిక్కచ్చిగా వసూలు చేసేవాడు. లేనివాళ్ళు, పేదలు అప్పడిగితే నిర్మొహమాటంగా లేదనే వాడు. బంధువులు, స్నేహితులు ఎవ్వరినీ యింటికి రానిచ్చే వాడు కాదు. ఒక మాటలో చెప్పాలంటే పిల్లికి బిచ్చం అటుంచి ఎంగిలి చేత్తో కాకిని కూడా తోలేవాడు కాదు.

గనిరాజు, ఊరు దృష్టిలో కష్టజీవి. సుఖం తెలియకుండా బతికేవాడు. పొలాలలోని కాయకూరలు యింటి అరుగు మీద పోసి అమ్మేవాడు. భద్రమ్మ, దొడ్డిగుమ్మంలోంచి పాలు, పెరుగు అమ్మేది. అన్నం వార్చిన గంజి, పచ్చి మిరప నంజుకొని తినటం. అన్నం పరమాన్నం. పంచె మాసినా పట్టించుకొనేవాడు కాదు. ఊళ్ళోగుడి అయినా, బడి అయినా చందాలకు ఎవ్వరూ వచ్చేవారు కాదు.

నా చిన్నతనం, స్కూలు చదువు మా ఊళ్ళోనే గడిచింది. నన్ను మేష్టారబ్బాయి అనేవారు. నాన్న స్కూలు మేస్టారుగా మా ఊళ్ళోనే రిటైరయ్యారు. ముగ్గురు అక్కల తరువాత నేను వంశోద్ధారకుణ్ణి. బతకలేక బడి పంతులు రోజులవి. పల్లెటూరు కావటంతో నాన్న నెలజీతంతో రోజులు గడిచేవి. పెద్దక్క తెలివైంది కావటంతో మెట్రిక్ మంచి మార్కులతో ప్యాసయింది. యింటి ఖర్చులకీ, అమ్మకు సాయంగా వుండటానికి, యింట్లోనే ట్యూషన్‌లు చెప్పేది. ఆరోజులలో చదువు ధ్యాస అందరికీ వుండేది కాదు. పెద్దమనుషులవటంతో, ఆడపిల్లలకు ఏదో సంబంధం చూసి పెళ్ళిళ్ళు చేసేవారు. మా ఊరు దగ్గరలో హైస్కూలుకు వెళ్ళి పిల్లలు చదువుకొనేవారు. క్రమేపీ వ్యవసాయాలు, కొన్ని కుటుంబాలలో ఉద్యోగాల పట్ల ఆసక్తి పెరిగే రోజులొచ్చాయి.

పెద్దక్క, అమ్మపోలిక కావటంతో అందంగా వుండేది. మానాన్నతో స్కూలులో పనిచేసిన మేష్టారొకరు, అక్కకు మంచి సంబంధం తెచ్చారు. అక్క నచ్చుటంతో, కట్నకానుకలు, పెళ్ళి ఖర్చులు, లాంఛనాలు అమాంబాపతు అయిదువేలడిగారు. పెన్షనుతో రోజులు గడిపే మాకు అంతడబ్బు ఎలా వస్తుంది: అమ్మా, నాన్న బెంగెటు

ట్కొన్నారు. అక్క యిప్పుడే పెళ్ళొద్దు. డిగ్రీ చదివి ఉద్యోగం చేస్తానంది. స్కూల్లో హెడ్‌మేష్టారు నాన్నను ఒప్పించి, గనిరాజును అప్పుగా కొంతైనా సర్దుబాటు చేయమని స్కూలుకు పిలిపించి అడిగారు. మేష్టారు రిటైరయ్యారు. ఇల్లు కూడా లేదు. వడ్డీ కట్టడం, అసలు తీర్చడం కష్టం అన్నాడు గనిరాజు. నాన్న క్రుంగిపోయాడు. తలదించుకొన్నారు.

సంవత్సరాలు దొర్లిపోయాయి. ప్రైవేటుగా ఎమ్.ఎ ఫస్ట్‌క్లాస్‌లో ప్యాసైన పెద్దక్క, హైద్రాబాదులో ఉద్యోగంలో చేరింది. అక్క, బావ ఇద్దరూ ఉద్యోగులు. బావ చాలా మంచివాడు. డబ్బు మనిషి కాదు. అక్క తెలివి, అందం చూసి పెళ్ళి చేసుకొన్నాడు. అమ్మ, నాన్న యిక పెద్దవాళ్ళు అవటంతో, కుటుంబ బాధ్యత వాళ్ళే చూస్తున్నారు. రెండో అక్కకూడా డిగ్రీ చదివి పెళ్ళి చేసుకొని అక్కడే సెటిలయింది. చిన్నక్క ఇంజనీరింగ్ చదువుతోంది. నాకు చదువు అంతగా రాకపోయినా, బావ సహాయంతో ప్రైవేటు కంపెనీలో మంచి ఉద్యోగంలో చేరగలిగాను. అమ్మ, నాన్న యింక మా ఊళ్ళోవుండటం కంటే హైద్రాబాదు మకాం మార్చటం మంచిదని అక్కలు, బావలు నిర్ణయం తీసుకొన్నారు. అందుకని నాకు మా ఊరి ప్రయాణం పడింది.

యింకా తెల్లవారకుండానే గౌతమి ఎక్స్‌ప్రెస్ వచ్చేసింది. బస్‌స్టాండ్‌కు వెళ్ళి ఫస్ట్‌బస్ ఎక్కితే ఒకగంటలో మా ఊరు వస్తుంది. స్టేషన్‌లో బ్రష్ చేసుకొని, కాఫీ తాగి బెంచ్ మీద కూర్చున్నాను. రైలు దిగిన పాసింజర్లతో, స్టేషన్ హడావిడిగా వుంది. ఎవ్వరో ఒక వృద్ధురాలు నా దగ్గరకు వచ్చి మేట్టారి అబ్బాయిగారా! అని పలకరించింది. ఆమెను గుర్తుపట్టాను. గనిరాజు భార్య. గనిరాజు ఎల్లా వున్నాడన్నాను. ఆమె కన్నీళ్ళు పెట్టుకొంది. యిక లాభంలేదు. బతకడు. యింటికి తీసుకు పొమ్మన్నారు. హైద్రాబాదు నుంచే వస్తున్నాం. అదిగో అక్కడ పడుకొన్నారంది. నేను వెంటనే అక్కడకు వెళ్ళాను. చూడండి! మేట్టారి అబ్బాయి అంది భద్రమ్మ. గనిరాజును చూస్తుంటే పరిస్థితి ప్రాణం వుండేటట్టులేదు. యింతలో వచ్చాడు. మా అబ్బాయి దత్తుడు అని పరిచయం చేసింది భద్రయ్మ. ముప్పై ఏళ్ళుంటాయి అతనికి. కళ్ళు ఎర్రగా వున్నాయి. గడ్డం మాసింది. జుట్టురేగింది. బట్టలు మాసివున్నాయి. మొహం ఉబ్బరంగా వుంది. జేబులో నోట్లకట్టలు కనపడుతున్నాయి. ఎవరే అన్నాడు. గుప్‌మని వాసన. మాటలోనే తెలుస్తోంది. రైలు ఆగడంతోనే గనిరాజును దింపి బెంచ్ మీద పడేసి, స్టేషన్ బయటకు వెళ్ళి మందు కొట్టొచ్చాడు.

మా ఊరు బస్‌లో చేరేటప్పటికి ఎనిమిదయింది. గనిరాజు కూడా గౌతమి ఎక్స్‌ప్రెస్‌లోనే వచ్చాడని, బతకటం కష్టమని నాన్నతో అన్నాను. అవును రా! ఎప్పుడూ బి.పి కూడా చూపించుకోలేదు. పైగా ఆచారిగారి మందులే. డయబిటెక్. గుండె జబ్బు కూడా వచ్చింది. డబ్బున్నా ఎవరి మాటా వినలేదు. ఏరికోరి దత్తత చేసుకొన్నాడు. ఆ కుర్రాడు ఆస్థి తగలేస్తున్నాడు. భద్రమ్మ ఏడుస్తుంటే మేం అంతా ఆ దత్తుడిని మందలించి, హైద్రాబాదు పంపించాం అన్నారు నాన్న.

ఆరోజు మా ఊళ్ళో ఎవరి నోట విన్నా గనిరాజు ఊసే. యింటి బయట పడుకోపెట్టారు. ఊరిజనం అంతా అయ్యో పాపం అంటూ చూసి వెళ్తున్నారు. మర్నాటికి కూడా ప్రాణం పోవటం లేదు. అదే పరిస్థితి. యింతలో ఎవ్వరో పొరుగూరు పెద్దాయన కబురు చేసాడు. గనిరాజు దిండు క్రింద రూపాయల కట్టలు పెట్టమని వెండి రూపాయల బిందె కడినిన నీళ్ళు పోసి గొంతు తడపమని. గొంతులో కాసులు తడిసిన నీళ్ళు తగలటంతోనే గుటకలు పడ్డాయి. యింతలో దత్తుడు ఎక్కడి నుంచో పరుగునా వచ్చి దిండు క్రింద నోట్లకట్టలు, అంతా చూస్తుండగా పట్టుకెళ్ళాడు. భద్ర మ్మ ఒక్కత్తే ఘొల్లుమంటూ ఏడుస్తోంది. యింటి దగ్గర అమ్మ అంది గనిరాజుది పెట్టిచీకుడు బతుకు అని.

*



## నా సెక్స్ సింబల్ ఇమేజ్ మసకబారిపోతోంది

**'జూలీ'** అనే సినిమాలో వేశ్య పాత్ర ధరించిన తర్వాత నేహా ధూపియాపై 'సెక్స్ సింబల్' అన్న ముద్ర పడిపోయింది. ఆమె కూడా దానికి ఏ అభ్యంతరం ప్రకటించలేదు. పైగా తనపై పడ్డ ఇమేజ్‌ను సమర్థిం చుకుంటూ ''బాలీవుడ్‌లో సెక్స్, షారుక్ ఖాన్ ఈ రెండే బాగా అమ్ముడౌతాయి'' అంటూ ఓ విలువైన సూక్తి కూడా చెప్పింది. అప్పటి నుండి పలుచటి దుస్తులు ధరించే అవకాశం ఉన్న పాత్రలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభించింది. అయితే మరో ప్రక్క మల్లికా షెరావత్ సినిమాకు ఇరవయ్యేసి ఎంగిలి ముద్దులతో, అరకొర దుస్తులతో విజృంభిస్తుండటంతో ఆమెకు ఆ రకంగా కూడా పెద్దగా అవకాశాలు రాలేదు. దాంతో కాస్తో కూస్తో నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలవైపు దృష్టి సారించింది. ఈ మధ్యనే 'ఏక్ చాలీస్ కీ లాస్ట్ లోకల్', 'మిత్యా' లాంటి ఆఫ్‌బీట్ చిత్రాల్లో నటనకు అవకాశం ఉన్న పాత్రలు ఎన్నుకుని 'నేహాకు నటించడం కూడా వచ్చ'ని నిరూపించుకుంది. ''నాకు లభిస్తున్న పాత్రలతో నేను సంతృప్తిగానే ఉన్నాను. 'జూలీ' తరువాత నాపై పడిన సెక్స్ సింబల్ ముద్ర ఇప్పుడు లేదు,'' అంటోంది. నేహ ఈ మధ్యనే 28వ పుట్టిన రోజు జరుపుకుంది. ''పుట్టిన రోజున నాకు వచ్చే మొదటి ఫోన్ శుభాకాంక్షలు తెలిపేది అయ్యుంటుందనుకున్నాను. పొద్దున్నే ప్రొడక్షన్ వాళ్ళు షూటింగ్‌కు రెడీకమ్మంటూ ఫోన్ చేసారు,'' అంటోంది నవ్వుతూ.